# అంతర్యం

—బద్దిగం పాండు రంగారెడ్డి

అన్నయ్యకు టైఫాయిడు వచ్చిందని, తన కోసం కలవరిస్తున్నాడని టెలిగ్రాం రాగానే వున్నది వున్నట్టుగానే ట్రెయిన్ కోసం కూడా ఆగలేక కారులో వచ్చి పడింది అన్నయ్య దగ్గరకు ప్రమీల. లోన గదిలోకి అడుగు పెట్టగానే వదిన ఎవరో 'ఆవిడ' ఒళ్ళో తలపెట్టుకు ఏడుస్తోంది. 'ఆవిడ' వదిన తల నిమురుతూ ఓదారుస్తోంది.

"ఎలా వుంది వదినా అన్నయ్యకి?" అని అడిగింది ప్రమీల ఆదుర్దాగా.

"ఫరవాలేదమ్మా, సీత ఊరికే గాభరా పడుతోందని" అంది 'ఆవిడ' సమాధానంగా.

సీతలేచి పమిట చెంగుతో ముఖం తుడు




చుకొని ప్రమీలను లోపలకి తీసుకు పోయింది. శేఖర్ చెల్లెల్ని చూడగానే ప్రేమగా నవ్వి "ఎప్పుడొచ్చావమ్మా? కంగారునిమీలేదు,మీవదినసంగతి తెలుసుగా. ఊరికే గాభరాపడి టెలిగ్రాం ఇచ్చింది" అన్నాడు భార్య వంక కృతజ్ఞతగా చూస్తూ.

ఐదు నిమిషాల కల్లా శేఖర్‌కు కొద్దిగా గ్లూకోజ్ నీళ్ళు, సీతకు, ప్రమీలకు టీ తీసుకు వచ్చింది 'ఆవిడ.'

"సీతా చూడు. రేఖగారు ఎంత కష్ట పడుతున్నారో మన కోసం" అన్నాడు శేఖర్.

"అవును తల్లిలా కాపాడుతోంది మనల్ని" అంది సీత స్నేహితురాలు రేఖ వంక ఆపహాయంగా చూస్తూ.

ప్రమీల పది రోజులపాటు అక్కడే వుంది. ఆ పది రోజులూ రేఖ కూడా అస్తమానం అక్కడే వుండి అన్ని సపర్యలూ చేస్తూ ఊరికే గాభరా పడే సీతను ఓదారుస్తూ వుంది. ఎందుకనో ప్రమీల, రేఖల మధ్య స్నేహంగాని, పరిచయంగాని వృద్ధికా లేదు. శేఖరుకు పథ్యం పెట్టాక ప్రమీల తన ఊరువెళ్ళిపోయింది. తరువాత ప్రమీలకు రేఖ ఎన్నడూ గుర్తుకురాలేదు. అప్పుడప్పుడు వదిన ఉత్తరంలో "రేఖ నిన్ను అడిగానని రాయమంది" అని వ్రాసినప్పుడు మాత్రం, ఓ క్షణం గుర్తుకొచ్చేది.

నాలుగైదు నెలలకు తిరిగి మరొక టెలిగ్రాం వచ్చింది. "వదినకు చాల సీరియస్‌గా వుంది, వెంటనే రమ్మని."

ఈసారి కూడా ట్రెయిన్ కోసం ఆగ లేక కారులోనే వచ్చేసింది ప్రమీల తన నాలుగేళ్ళ కొడుకుని తీసుకొని ఆత్రుతగా లోనకు వెళ్ళింది. ఒక్కడుగు వెనక్కు పడింది. ఎదురుగా అన్నయ్య చేతులతో ముఖం కప్పుకుని వున్నాడు. 'ఆవిడే' రేఖ అతని తల నిమురుతూ వుంది. ప్రమీల తెల్లబోయింది.

"అన్నయ్యా! వదినకు ఎలా వుంది?" అంది కాస్త ఏహ్యంగా.

"రా ప్రమీలా! సీత నీ కోసం ఒకటే కలవరిస్తోంది. కంగారు ఏమీ లేదు. అబా ర్షనయి కాస్త గడబిడయింది." అని లోనకు తీసుకు వెళ్ళింది రేఖ. ముభావంగా వెళ్ళింది ప్రమీల. తాను చూసిన 'రేఖ అన్నయ్య తల నిమరడం' దృశ్యమే కళ్ళకు కదులోంది-ప్రతి క్షణమూ.

"రా ప్రమీలా! భలే ధ్యాస పోయింది నీ మీద! ఏదీ! మీ అన్నయ్యకు కనపడ్డావా?" అని అడిగింది సీత ప్రమీలను చూడగానే.

ప్రమీలకు వదినంటే చాలా అపేక్ష.

"ఎంత అమాయకమయింది వదిన! అన్నయ్య ఎంతగా మారిపోయాడు." అను కుంది ప్రమీల.

"రేఖా! చూడు. ఆయనకూ, ప్రమీ లకూ కాఫీ తీసుకురావూ!" అంది సీత. రేఖ వంటింట్లోకి వెళ్ళింది.

"రేఖ లేకపోతే మేమేం అయిపోయే వాళ్ళమో! తన ఋణం తీర్చుకోలేం." అంది సీత.

"ఇంత పిచ్చి వదినను ఎలా మోసం చేస్తున్నారా వీళ్ళిద్దరూనూ." అనుకుంది కసిగా ప్రమీల. అన్నయ్య మీద ఎక్కడలేని కోపం వచ్చింది.

"మీ అన్నయ్య మరీ బెంగపెట్టుకు న్నారు. అన్నం అదీ రేఖే సరిగా చూసి బలవంతంచేసి పెడుతోంది." అంది సీత.

వదిన మాటలు వింటున్న కొద్దీ ప్రమీ లకు వదిన మీద జాలి! అన్నయ్య మీద, రేఖ మీద కసి, అసహ్యం పుట్టుకొస్తున్నాయి.

"వదినకు జబ్బుగా వుంటే, వీళ్ళకి సరసాలు మాట. వదినంటే ప్రాణాలిచ్చే అన్న య్యేనా ఇలా మారిపోయాడు." అనుకుని తెగ తిట్టుకుంది శేఖర్‌ని లోలోన ప్రమీల. ఒక వారం రోజులపాటు ఉన్నా, ఈసారి అన్నయ్యతో కూడా ముభావంగానే వుంది ప్రమీల. సీతకు నెమ్మదించిన తరవాత వెళ్ళి పోయింది ప్రమీల.

ప్రమీల వెళ్ళిన పది, పదిహేను రోజులకే తన నాలుగేళ్ళ కొడుక్కి కడుపులో నొప్పి వచ్చింది. దాని మీద బాగా 'టెంపరేచర్' కూడాను. రెండు రోజులకే అకస్మాత్తుగా చనిపోయాడు బాబు. ప్రమీల ప్రాణ్వడి పోయింది. కళ్ళ వెంట నీళ్ళు కూడా రాలేదు ఆ వేళంతా. రెండవ రోజుకి స్పృహలోకి వచ్చింది. ఒక్కసారిగా కొడుకు చావు గుర్తుకు వచ్చింది. కట్టతెగిన ప్రవాహంలా ఘొరుమంది. తన భర్త అన్నగారు వచ్చి పలకరిస్తే, కుమిలి కుమిలి ఏడ్చింది చేతులలో ముఖం పెట్టుకుని.

"ఊరుకో అమ్మా! ఊరుకో! పోయిన వాడు వస్తాడా! నీ ఆరోగ్యం చూడు ఎలా వుందో! లే! ముఖం కడుక్కుని కొంచం కాఫీ తాగమ్మా." అని ముఖం మీద నుంచి చేతులు తీసేసి, లేవదీసి, తీసుకు వెళ్ళాడు 'బాత్‌రూం'లోకి ప్రమీలను ఆయన.

ప్రమీల అంతకు పూర్వం ఎప్పుడూ ఎక్కువగా బావగారితో మాట్లాడలేదు. ఆయన కూడా ఎప్పుడూ తనతో చనువుగా లేదు. వయసు కూడా ముప్పయి, ముప్పై అయిదుకి మించదు. అయినా ఆయన అప్పుడు తనను అలా పట్టుకు తీసుకు వెళ్ళు తుంటే సహజంగానే అనిపించింది. ఎవరో అన్నుడు, తండ్రి లాంటివాడు తనని ఓదా రుస్తున్నట్టుగా అనిపించింది. వదినకు జబ్బుగా వున్నప్పుడు 'రేఖ తన అన్నయ్యకు తల నిమిరిన' దృశ్యం కళ్ళకు కట్టింది. ఒక్కసారిగా వెళ్ళి రేఖను గట్టిగా కౌగలించు కోవాలనుకుంది ప్రమీల.

